بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 26 June 2026 (Telugu)

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పేదలను ఆదరించడం, దాతృత్వం, ఉదారత ఆధారంగా విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26.06.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. అల్లాహ్ తఆలా ఆదేశాలను, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శాలను అనుసరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం జీవితంలో పేదలను ఆదరించడం, ఉదారత్వానికి సంబంధించిన అనేక సంఘటనలు మనకు కనిపిస్తాయి. ఆయన (అ) తమ ప్రకటన తర్వాతే కాకుండా, అంతకుముందు ఆయన (అ) జీవిత ప్రారంభ రోజులలో, యవ్వనంలో కూడా ఆయన (అ) అత్యున్నత నైతికతకు సంబంధించిన సంఘటనలు మనకు కనిపిస్తాయి.

అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను ఏ తల్లి ఒడిలోనైతే పెంచి పెద్ద చేశాడో ఆమె జీవితాన్ని మనం చూసినప్పుడు కూడా అక్కడ మనకు పేదలను ఆదరించడం,ఉదారత్వానికి సంబంధించిన సంఘటనలు కనిపిస్తాయి. అనగా ఆయనకు అత్యున్నత నైతికతను నేర్పించిన ఒక గొప్ప తల్లి ఒడిలోనే ఆయన పెరిగారు. హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ గారు రజియల్లాహు అన్హు ఇలా వ్రాశారు. హజ్రత్ మాయీ చిరాగ్ సాహిబా అనగా హుజూర్ (అ) గారి గౌరవనీయురాలైన తల్లిగారి కుటుంబం, హోషియార్‌పూర్ జిల్లాలోని ఐమా గ్రామానికి చెందిన ఒక గౌరవప్రదమైన, నిజమైన మొఘల్ కుటుంబం. ఆమె స్వభావంలో ఉదారత్వం, దాతృత్వం, ఆతిథ్య మర్యాదలు బాగా నిండి ఉన్నాయి. పవిత్రత, శీలానికి ప్రతీక అయిన ఒక మహిళలో ఉండవలసిన ఉన్నతమైన లక్షణాలన్నీ ఆమెలో ఉండేవి. ఆమె ఎల్లప్పుడూ ప్రసన్నంగా, హుందాగా ఉండేవారు. అతిథులకు సేవ చేయాలనే విషయంలో ఆమె హృదయంలో ఎంతో ఉత్సాహం, విశాల మనసు ఉండేవి. నలుగురు వ్యక్తుల కోసం ఆహారం పంపమని ఆమెకు సమాచారం అందితే, అక్కడి నుండి వచ్చే ఆహారం ఎనిమిది మంది కంటే ఎక్కువ మందికి సరిపోయేలా ఉండేది. ఆమె తన పట్టణంలోని పేదలు, బలహీనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. ఆమె దినచర్యలో ఒక ప్రత్యేకమైన విషయం ఏమిటనగా ఆ ప్రాంతంలోని పేద ప్రజలు ఎవరైనా మరణిస్తే, వారి అంత్యక్రియలకు అవసరమైన కఫన్ (శవవస్త్రం) ఆమె ఇంటి నుండే లభించేది.

హజ్రత్ మియాం అల్లాహ్ యార్ గారు (రజి) అన్హు ఇలా వివరించారు. హుజూర్ అలైహిస్సలాం సియాల్‌కోట్‌లో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో, ఒకసారి హుజూర్ తల్లిగారు ఆయన కోసం రెండు జతల దుస్తులు మరియు కొన్ని లడ్డూలు మంగళ్ అనే ఒక నాయీ బ్రాహ్మణుని ద్వారా పంపించారు. (అతనిట్లు తెలిపెను) నేను ఆ వస్తువులను తీసుకొని సియాల్‌కోట్ వెళ్లి హుజూర్ గారికిచ్చినప్పుడు, హుజూర్ (అ) నాతో ఇలా అన్నారు. ఇందులో నీ వాటాగా ఏది వస్తుందో అది నువ్వు తీసుకో, నా వాటా నాకు

ఇచ్చేయ్. దానికి నేను హుజూర్! ఇవి మీ కోసమే. మీ తల్లిగారు మీ కోసమే పంపించారని అన్నాను. అప్పుడు ఆయన నువ్వు ఈ వస్తువులన్నింటినీ అంత దూరం నుండి మోసుకొచ్చావు కదా, కాబట్టి ఇందులో నీ సగం భాగం ఖచ్చితంగా తీసుకో అని చెప్పారు. చివరికి నాకు ఒక జత దుస్తులు, కొన్ని లడ్డూలు ఇచ్చారు. ఆపై నాతో ఇలా అన్నారు. అమ్మాజాన్ వద్దకు వెళ్లి, నన్ను ఇక్కడి నుండి త్వరగా తిరిగి పిలిపించమని చెప్పు, నా మనస్సు ఇక్కడ అస్సలు కుదరడం లేదు.

హ్రజత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఒక కథనాన్ని వివరిస్తూ ఇలా అన్నారు. హ్రజత్ గారు సియాల్‌కోట్‌లో నివసిస్తున్నప్పుడు, ఆయన ఇంట్లో ఎవరినీ ఎక్కువగా కలుసుకునే వారు కాదు. మిర్జా గారికి వచ్చే జీతాన్ని ఆయన పేదలకు, అవసరార్థులకు పంచిపెట్టేవారు. వారికోసం బట్టలు కుట్టించి ఇచ్చేవారు లేదా నగదు రూపంలో సహాయం చేసేవారు. తన స్వంత అవసరాల కోసం కేవలం భోజన ఖర్చులు మాత్రమే ఉంచుకునేవారు. ప్రారంభ రోజుల్లో ఆయన (అ) ఏకాంతంగా ఉండేవారు, ఆయన మొగ్గు కూడా అలాగే ఉండేది. అందువల్ల, ఇటువంటి ఉన్నతమైన నైతిక లక్షణాలు చాలా గుప్తంగా వ్యక్తమయ్యేవి. కానీ ఎప్పుడైతే అల్లాహ్ తఆలా ఆయనను ప్రజల్లోకి తీసుకువచ్చాడో, ప్రజల రాకపోకలు విపరీతంగా పెరిగాయో, ఆయన పరిస్థితులు బహిర్గతమయ్యాయో, అప్పుడు ఈ సంఘటనలను చూసేవారు, వివరించేవారు కూడా తయారయ్యారు. సహాయం కోసం వచ్చే ఏ యాచకుడిని లేదా అడిగేవాడిని ఆయన ఎన్నడూ ఖాళీ చేతులతో తిప్పి పంపేవారు కాదు.

హ్రజత్ మౌలానా అబ్దుల్ కరీమ్ గారు (రజి) ఇలా వివరించారు. ఒకరోజు అస్ర్ నమాజ్ ముగిసిన తర్వాత హ్రజత్ గారు లేచి, లోపలికి వెళ్లడానికి మసీదు కిటికీలో అడుగు పెట్టారు. అంతలోనే ఒక యాచకుడు చాలా నెమ్మదిగా నేను సహాయం కోసం వచ్చానని అన్నాడు. ఆ సమయంలో హ్రజత్ గారికి ఏదో ఒక ముఖ్యమైన పని ఉండెను, పైగా ఆ యాచకుడి స్వరం అక్కడ ఉన్న మిగతా వ్యక్తుల మాటల శబ్దాలలో కలిసిపోయింది. ఆయన లోపలికి వెళ్లిపోయినప్పటికీ ఆ యాచకుడి మృదువైన స్వరం ఆయన హృదయంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. హ్రజత్ గారు వెంటనే ఖలీఫా నూరుద్దీన్ (రజి) గారిని పిలిచి, అక్కడ ఒక యాచకుడు వచ్చాడు, అతడు ఎక్కడున్నాడో చూడండని చెప్పారు. కానీ వెతికినప్పటికీ అతడు కనిపించలేదు. తిరిగి సాయంత్రం నమాజ్ తర్వాత హ్రజత్ గారు కూర్చున్నప్పుడు, అదే యాచకుడు మళ్లీ వచ్చి సహాయం కోసం అడిగాడు. హ్రజత్ గారు త్వరగా తన జేబులో నుండి ఏదో తీసి అతని చేతిలో పెట్టారు. ఆ సమయంలో ఆయనను చూస్తే, తనపై ఉన్న ఏదో ఒక పెద్ద భారం దిగిపోయినట్లుగా ఎంతో సంతోషంగా ఉన్నట్లు అనిపించింది.

ఖాదియాన్‌కు ఆరు మైళ్ల దూరంలో సఠియాలీ అనే ఒక చిన్న గ్రామం ఉంది. అక్కడి నుండి ఒక జట్ ఫకీరు వస్తూ ఉండేవాడు. అతడు మస్జిద్ ముబారక్ కింద ఉన్న కిటికీ వద్దకు వచ్చి గులామ్ అహ్మద్! ఒక రూపాయి తీసుకోవాలి' అని గట్టిగా పిలిచి, అక్కడే కూర్చునేవాడు. ఒకవేళ హ్రజత్ గారు ఏదైనా పనిలో నిమగ్నమై ఉంటే, అతడు కొద్ది కొద్దిసేపటికీ అలానే పిలుస్తూ ఉండేవాడు. ఇది చాలా మందికి నచ్చేది కాదు. కానీ ఎవరైనా అతనితో కఠినంగా మాట్లాడినట్లు హ్రజత్ గారికి తెలిస్తే, ఆయన దానిని అస్సలు ఇష్టపడేవారు కాదు. పైగా ఆయన నవ్వుతూ అతనికి ఆ రూపాయి ఇచ్చేసేవారు.

1905లో హుజూర్ (అ) చివరిసారి ఢిల్లీ వెళ్లారు. ఒకరోజు ఆయన ఢిల్లీలోని దర్గాలు తదితర ప్రాంతాలను సందర్శించే ఉద్దేశంతో బయలుదేరారు. అప్పుడు ఒకరు హుజూర్! ఆ వైపు దారిలో యాచకులు ఎంత ఎక్కువగా ఉంటారంటే, అక్కడి నుండి వెళ్లడమే కష్టమైపోతుంది అని చెప్పారు. దానికి ఆయన ఈరోజు మనం వెళ్దాం, మనం అందరికీ ఇస్తాం అని అన్నారు. ఆ రోజు విన్నంత ఎక్కువ

మంది యాచకులు అయితే కనిపించలేదు కానీ, కొందరు ఎదురయ్యారు. వారిలో ప్రతి ఒక్కరూ తాము కోరిన సహాయాన్ని నిజంగానే పొందారు. హజ్రత్ హాఫీజ్ అహ్మదుల్లా గారు నాగ్‌పూరి (రజి) ఇట్లన్నారు. ఒకరోజు హుజూర్ గారు గుండ్రటి గదిలో ఆశీనులై ఉన్నారు. అక్కడ సుమారు 20 లేదా 25 మంది కూర్చుని ఉన్నారు. హుజూర్ గారు ఏదో ప్రసంగిస్తుండగా ఒక ఫకీరు వచ్చి గట్టిగా అడిగాడు. హుజూర్ గారి ప్రసంగానికి అతడు అంతరాయం కలిగిస్తున్నాడని నాకు చాలా చిరాగ్గా అనిపించింది. అందుకే నేను తలుపు వేసేశాను. అప్పుడు ఆయన తన ప్రసంగాన్ని ఆపి నాతో లోపలి తలుపు తట్టి, ఆ యాచకుడికి లోపలి నుండి ఏదైనా ఇప్పించు అని చెప్పారు. అంతేకాకుండా సహాయం కోసం వచ్చిన యాచకుడిని చూసి తలుపులు వేసేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ గారు (రజి) ఇలా వ్రాశారు. నేను 1892 నుండి ఖాదియాన్‌కు వస్తూ ఉండేవాడిని. 1898 నుండి శాశ్వతంగా హజ్రత్ గారి సేవలో చేరిపోయాను. నా ముందే ఎంతో మంది ప్రజలు ఆయనను సహాయం కోసం అర్థించారు. హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం ఏ యాచకుడికైనా రాగి నాణెం ఇవ్వడం నేను ఎన్నడూ చూడలేదు. ఆయన ఎల్లప్పుడూ వెండి నాణేన్నే ఇచ్చేవారు, అంటే ఎక్కువ మొత్తంలో డబ్బు ఇచ్చేవారు. ఒకసారి ఒక ఫకీరు హజ్రత్ గారి వద్దకు వచ్చి నేను వ్యక్తిగతంగా అడవిలో ఒక బావిని తవ్వించాలనుకుంటున్నాను. దానివల్ల అక్కడ ప్రయాణికులకు విశ్రాంతి దొరుకుతుంది, వారు నీళ్లు తాగుతారని కోరాడు. ప్రజల సేవ కోసం అతడు ఈ పని చేస్తున్నాడని తెలుసుకొని, హజ్రత్ గారు అతనికి 200 రూ।। ఇచ్చారు 'నువ్వు ప్రజల సేవ కోసం ఈ పని చేస్తున్నావు కాబట్టి నేను ఈ డబ్బు ఇస్తున్నానని చెప్పారు. ఈ విధంగా ఆయన మానవ సేవ చేయమని కేవలం ఆదేశించడమే కాకుండా, స్వయంగా ఆచరించి ఒక ఆదర్శవంతమైన ఉదాహరణగా నిలిచారు.

హజ్రత్ అబ్దుల్ సమీ గారు (రజి) ఇలా వివరించారు. మియాఁ షరీఫ్ అహ్మద్ గారు (రజి) అఖీఖా జరుగుతోంది. అతిథి గృహంలో అతిథులందరూ భోజనం చేస్తుండగా, ఒక ఫకీరు అడుక్కోవడానికి లోపలికి వచ్చాడు. అక్కడున్న ప్రజలు అతనిని బయటకు పంపించసాగారు. అది చూసి హుజూర్ (అ) స్వయంగా ఆ ఫకీరుకు ఆహారాన్ని అందించి, అతనిని గద్దించవద్దని ప్రజలను వారించారు. అతడు భోజనం చేయడానికి వచ్చాడు, అతనిని గద్దించకూడదని చెప్పారు. హజ్రత్ మున్షీ జఫర్ అహ్మద్ గారు (రజి) ఒక సంఘటనను ఇట్లు వివరించారు. ఒకసారి ఒక మౌల్వీ ఖాదియాన్‌కు వచ్చి ఈసా (అ) మరణం మరియు పునరుజ్జీవనంపై హుజూర్ గారితో వాదించడం ప్రారంభించాడు. హుజూర్ గారు అతనికి సమాధామివ్వడం ప్రారంభించగానే అతడు మూగబోయాడు. ఆ తర్వాత ఆయన అతనికి నచ్చ జెప్పి నీకు అర్థమైందా? అని అడిగారు. దానికి అతడు అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ నాకు అర్థమైంది, మీరే దజ్జాల్ అని అన్నాడు (నవూజుబిల్లాహ్) ఎందుకంటే వాదనలో అవతలి వారి నోరు మూయడం దజ్జాల్ లక్షణం అని అతడు వాదించాడు. అయినాసరే ఆయన (అ) ఏమీ అనకుండా మౌనం పాటించారు, ఆ మౌల్వీ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అతడు అమృత్‌సర్ వెళ్లి ఒక కరపత్రం ముద్రించి అందులో ఈ సంఘటనను ప్రస్తావిస్తూ ఇలా వ్రాశాడు. వారు (హుజూర్) లోపలికి వెళ్లిన తర్వాత, నేను చాలా అవసరంలో ఉన్నానని నాకు ఏదైనా సహాయం చేయమని కోరుతూ ఒక చిన్న చీటీ లోపలికి పంపాను. వారు వెంటనే నాకు 15 రూ।। పంపించారు. నిజంగా వారు చాలా దాతృత్వం గలవారు.

హజ్రత్ ఖాజీ అబ్దుల్ గఫూర్ గారు (రజి) ఇలా వివరించారు. 1906లో నేను నా పెద్దన్నయ్యతో కలిసి రావల్పిండి నుండి ఖాదియాన్‌కు వెళ్లాను. హుజూర్ అలైహిస్సలాం మసీదు మెట్లు దిగుతున్నారు. ఆ సమయంలో హకీమ్ షా నవాజ్ అనే ఒక వ్యక్తి హుజూర్ గారికి ఒక సంచిలో 17 పౌండ్లను

కానుకగా సమర్పించారు. హుజూర్ ఆ సంచిని తీసుకొని తన జేబులో వేసుకున్నారు. కింద నిలబడి ఉన్న ఒక యాచకుడు సహాయం కోసం అర్థించాడు. హుజూర్ వెంటనే తన జేబులో నుండి అదే సంచిని తీసి అతని చేతిలో పెట్టారు. అప్పుడు హకీమ్ గారు హుజూర్! అందులో 17 పౌండ్లు ఉన్నాయని మనవి చేశారు. దానికి ఆయన ఇది అతని భాగ్యమే, అతనికే చేరిందని అన్నారు. ఆ కాలంలో ఇది చాలా పెద్ద మొత్తం.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) హజ్రత్ ఉమ్ముల్ మూమినీన్ ద్వారా ఒక కథనాన్ని ఇలా వ్రాశారు. మా అమ్మగారు నాతో ఇలా చెప్పారు. హజ్రత్ గారు ఎంతో దానధర్మాలు చేసేవారు. సాధారణంగా ఆయన ఆ దానాలను ఎంత రహస్యంగా చేసేవారంటే మాకు కూడా తెలిసేది కాదు. ఆయన ఎంత దానం చేసేవారు? అని నేను అడగ్గా అమ్మగారిట్లు బదులిచ్చారు. చాలా ఎక్కువగా చేసేవారు. వారి జీవిత చివరి రోజుల్లో, ఆయనకెంత ధనం వచ్చినా అందులో నుండి పదో వంతును కేవలం దానధర్మాల కోసమే ప్రత్యేకంగా పక్కన పెట్టేవారు. దీని అర్థం ఆయన పదో వంతు కంటే ఎక్కువ ఇచ్చేవారు కాదని కాదు. కొన్నిసార్లు ఖర్చులు అవసరానికి మించి పెరిగినప్పుడు దానధర్మాల లో ఎలాంటి లోటు రాకూడదనే ఉద్దేశంతో ఆయన ముందే కనీసం పదో వంతును వేరుగా ఉంచేవారు. ఆ ధనం మరే ఇతర అవసరాలకు ఖర్చు కాకుండా ఉండడానికే ఆయనలా చేసేవారు. దానధర్మాలు చేసే విషయంలో ఆయన అహ్మదీలు, అహ్మదీయేతరులనే తేడా చూసేవారు కాదు. సహాయం కోసం వచ్చిన ఏ యాచకుడిని ఖాళీ చేతులతో తిప్పి పంపకపోవడం ఆయన అలవాటు. అలాగే సహాయం కోరే వ్యక్తి ప్రతి చిన్న అవసరాన్ని లేదా పరిస్థితిని కూడా ఆయన చాలా చక్కగా అర్థం చేసుకునేవారు.

ఒకసారి ఒక వ్యక్తి ఆయనకు ఒక అందమైన టోపీని పంపించాడు. ఆ పార్శిల్ హజ్రత్ గారి వద్దకు చేరిన సమయంలో యాదృచ్ఛికంగా అక్కడ ఒక హిందూ వ్యక్తి కూడా ఉన్నాడు. హజ్రత్ గారు ఆ పార్శిల్‌ను విప్పినప్పుడు అందులో ఒక టోపీ ఉండెను. ఆ హిందూ వ్యక్తి ఆ టోపీని ఎంతో ప్రశంసించాడు. అది చూసి హజ్రత్ గారు ఆ టోపీని అతనికే ఇచ్చేశారు.

ఒక అహ్మదీ సభ్యుడైన సర్ఫరాజ్ ఖాన్ ఇలా వివరించారు. మేము జల్సా కోసం వచ్చినప్పుడు ఒకరు హుజూర్ గారికి ఒక ఆడగుర్రాన్ని కానుకగా ఇచ్చారు. ఆ గుర్రాన్ని చూసి ఈ గుర్రం నాకు దక్కితే బాగుండు, దీనిని నా ఊరికి తీసుకెళ్లి ఇది మసీహ్ గారి గుర్రం అని అందరికీ చెప్పుకుంటానని నా మనస్సులో అనుకున్నాను. జల్సా ముగిసిన తర్వాత నేను హుజూర్ గారి వద్దకు వెళ్లి హుజూర్! నేను తిరిగి ఊరికి వెళ్లాలనుకుంటున్నానని మనవి చేశాను. దానికి ఆయన కొంతకాలం ఆగు అని చెప్పారు. కొన్ని రోజుల తర్వాత నేను మళ్లీ అదే విషయం చెప్పగా, హుజూర్ నాతో చౌదరి గారు! ఈ గుర్రాన్ని మీరు తీసుకెళ్ళండని అన్నారు. అప్పుడు నేను హుజూర్! ఈ గుర్రం ధర ఎంత? అని అడిగాను. దానికి ఆయన దీనికి గడ్డి, దాణా వేసి దీనిపై స్వారీ చెయ్యండి, అదే దీని ధర అని బదులిచ్చారు.

చివరగా హుజూరె అన్వర్ ఇలా ప్రార్థించారు. ఏ నైతిక విలువలను స్థాపించుటకు అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాస్యంలో ఆయన్ను ఈ లోకానికి పంపించాడో మనలో కూడా అలాంటి గొప్ప నైతిక విలువలను కల్పించుకొనుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక!

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔